


అర్ధరాత్రి, ఊరంతా నిద్రాదేవి ఒడిలో పవళిస్తున్న వేళ వెంకయ్యకు మాత్రం నిద్ర దూరమైంది. ఆలోచనల్తో నిద్రపట్టడంలేదు. రోజు గడవడమే కష్టమైపోతూంది. అంతమంది పొట్టలు నిండాలంటే తన సంపాదన ఏమాత్రం చాలడంలేదు. ఎలా? ఏం చెయ్యాల? అనుకుంటూ గుడిసెలో వున్న గుడ్డిదీపపు వెలుగులో ఆదమరచి నిద్రిస్తున్న భార్యాపిల్లల వైపు చూశాడు. అతని చూపులు అప్రయత్నంగా పదిహేనేళ్ళు నిండుతున్న పెద్దకూతురు సుందరి మీద నిలిచిపోయాయి.

వెంకయ్య సుందరి కేసి దీక్షగా చూశాడు. పచ్చటి ఛాయ, నొక్కులజుత్తు, పెద్ద పెద్ద కళ్ళు, సన్నటి పెదవులతో తీర్చిదిద్దినట్టుగా వుండే చిన్న నోరు, సుందరి మంచి అందమైన పిల్ల. "ఇంత అందమైంది తన కూతురా!" అనుకుంటే వెంకయ్యకు అప్పు డప్పుడూ ఆశ్చర్యం కలగక మానదు. ఒకప్పుడు తనూ, తన భార్య కూడ మంచి ఛాయలో బాగావుండేవారమని, కాయకష్టం వల్ల తమ శరీరం రంగు లావణ్యం కోల్పోయాయని మర్చిపోయాడు వెంకయ్య. సుందరి తొమ్మిదవ తరగతి చదువుకుంటూంది. తమ వంటివారు చదివి ఎవరి నుద్ధరించాలి అంటాడు వెంకయ్య కాని సుందరి పట్టు దలగా చదువుకుంటూంది.

సుందరినే చూస్తూ ఆలోచిస్తున్న వెంకయ్య బుర్రలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. అప్రయత్నంగా లేచి కూర్చు న్నాడు. అతని పెదాల మీద చిరునవ్వు మెరిసింది. ఇంతకాలం ఆ ఆలోచన కలగ నందుకు తన్ను తాను తిట్టుకున్నాడు. తనకు తట్టిన ఆలోచనను అప్పటికప్పుడు భార్యకు చెప్పాలని ఆమెను తట్టి లేపాడు వెంకయ్య.

"ఏటయ్యా! అర్ధరాత్రి!" విసుక్కుంటూ లేచి కూర్చుంది రాములమ్మ.

"రేపట్నుంచి సుందరిని నా వెంట టీ బండితో పాటు పిల్చుకెళ్తాను" ఆ చిరు వెలుగులో భార్య వంక పరీక్షగా చూస్తూ అన్నాడు వెంకయ్య.

"ఏటీ! మన సుందరినా! నీకేమన్నా మతి పోయిందా!" ఆశ్చర్యంగా ప్రశ్నించింది రాములమ్మ.

"నా మతి బాగానేవుందే! మనం బాగు పడాలంటే ఈ పని సెయ్యక తప్పదు!"

"మన బాగుకి, దాన్ని టీకొట్టుకి పిల్చుకు పోడానికి సంబంధమేటయ్యా! నాకేం తెలవ కుండా వుంది" విసుగ్గా అడిగింది రాములమ్మ.

"అదేనే వెర్రిముఖమా! ఈ కాలంలో ఆడకొంగు తగిలితే సాలే మగనాయాళ్లకి! అందుకే మన టీ బండి దగ్గర సుందరి నిలుసుంటే సాలే! మన వ్యాపారం జోరుగా వుంటది! ఇప్పుడు ఎంత కష్టబడ్డా రాని డబ్బు, సుందరి అక్కడ కొచ్చి నిలుసుంటే వస్తుందే! దాని అందం అట్టాంటిది! కాసులు రాలతాయే! నీకేంతెలుసు!" ఊహా లోకంలో తేలిపోతూ అన్నాడు వెంకయ్య.

"ఛీ! ఆడపిల్లను అక్కడ నిలబెడతావా! పెద్దమనిషైన పిల్లను నలుగురి ముందూ నిల్చోబెట్టి టీ అమ్మిత్తావా? అది సదూ కుంటావుంది! అదెందుకక్కడికి! నేనెల్తా పద!" కయ్యిమంది రాములమ్మ.

"నువ్వెందుకే మునల్దానివి? నీవైపూ నావైపూ ఎవడు సూత్తాడే? అయినా మనకి సదువెందుకే? అది సదివిన సదువు సాలు గానీ, నావెంటరేపట్నుండి దీసికెళ్తాను! నువ్వే సూస్తావుగా మన వ్యాపారం ఎట్టా వుంటుందో?"

"సాల్లేవయ్యా! నీ కబుర్లూనువ్వూనూ! అంత అందమైన పిల్ల వున్నందుకు సంతోసించాల్సింది బోయి కొట్టుకాడ పెడ్తావా? ఎంత జరక్కపోతే మ్మాత్రం! పదిమందీ నవ్వుతారు తెల్సిందా!"

"నవ్వే పది మందీ బువ్వెడతారే! పిచ్చిదానా! టీబండి దగ్గర సుందరి నిలుసున్నంత మ్మాత్రాన నష్టమేమి లేదులేవే! రేపట్నుంచి సుందరి నా ఎంట వస్తాది! ఇంకేమి జెప్ప మాకు!" విశ్వాసయంతో అన్నాడు వెంకయ్య.

"అదికాదయ్యా! నా మాటిను..." ఇంకా ఏదో చెప్పబోతున్న రాములమ్మను...

"ఛ! నోర్ముయ్!" అంటూ ఆమెను ఓ గుద్దు గుద్దేడు వెంకయ్య.

ఇక నోర్మయ్యక తప్పలేదు రాములమ్మకు. వెంకయ్యకు కోపం వస్తే వళ్ళు హూనం అయిపోతుంది అతడు తల్చుకుంటే యిక ఎవరేం చెప్పినా వినడు. అనుభవపూర్వకంగా తెలిసిన రాములమ్మ వూరుకుండిపోయింది. ఇదేమి తెలియని సుందరి అమాయకంగా నిద్రిస్తోంది.

* * *

తూర్పు తెల్లారింది. సుందరి లేచి ఇంటికి కావాల్సిన నీళ్ళు తెచ్చి పోసింది. గుడిసె ముందు వూడ్చి, నీళ్ళుజల్లి ముగ్గుపెట్టింది. పుస్తకాలు తీసి చదువుతూ కూర్చుంది. వెంకయ్య అంతకు ముందే లేచి ఎక్కడికో వెళ్లిపోయాడు.

తొమ్మిది గంటలకు తల్లి పిల్లలందరికీ చద్దెన్నాలు పెట్టింది. సుందరి తర్వాతి ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల, తిండి తినేసి ఆడుకునేందుకు పోయారు. వాళ్ళెవరూ చదువుకోవడంలేదు. సుందరి తల దువ్వుకుని, ముఖాన తిలకం బొట్టు పెట్టుకుని, పుస్తకాలు సర్దుకుంది. ఇంతలో వెంకయ్య ఓ సంచితో లోపలికి వచ్చాడు.

"అయ్యా! నేను స్కూలుకెళ్తున్నాను" అంటూ పోబోయింది సుందరి.

"ఈరోజు నుండీ స్కూలు మానేయి." సంచిలో నుండి ఒక్కొక్క వస్తువే తీస్తూ అన్నాడు వెంకయ్య.

"స్కూలు మానెయ్యాలా! ఎందుకూ?" అర్థం కాక నిలుచుండి పోయింది సుందరి.

"మీ అమ్మ సెప్పలేదా! ఒసే రాముడూ! దీనికేమి సెప్పలేదా!" అన్నాడు, అక్కడే ఓ పక్కగా పొయ్యి మంటేస్తున్న రాములమ్మ వంకచూస్తూ. రాములమ్మ మాట్లాడలేదు.

"ఒసే సుందీ! నువ్వు యికనుండి రోజా టీ బండితోపాటు రావాల! ఇక సదువు అదీ కట్టిపెట్టు! ఇంద ఈ కొత్తసీర కట్టుకో! ఇదిగో పౌడరు డబ్బా! ఇదిగో కాటుకా? త్వరగా లెములు! ఇప్పటికే ఆలీసం అయిపోయింది" అంటూ తను తెచ్చిన వస్తువులన్నీ సుందరికి చూపిస్తూ త్వర పెట్టాడు వెంకయ్య.

సుందరికి "ఇకనుండి రోజా టీ బండితో పాటు రావాల" అన్న మాటలు తప్ప యింకేమి వినిపించలేదు. ఆమె చేతిలోవున్న పుస్తకాలు అప్రయత్నంగానే జారిపోయాయి. ఆశ్చర్యంగా కళ్ళు వెడల్పు చేసుకుని తండ్రి వంకే చూస్తుండి పోయింది.

ఏమీ మాట్లాడక నిల్చున్న కూతురుని చూస్తూ "ఏమిటే అట్లా వుండిపోనావు! త్వరగా తయారవు. ఓసే రాముడూ, దీనికి సీరగట్టు" అన్నాడు వెంకయ్య.

"అమ్మా! నిజంగా వెళ్ళాలా అమ్మా! అయ్య చెప్పింది నిజమేనా?" కన్నీళ్ళు కారిపోతూంటే తల్లిని పట్టుకుని అడిగింది సుందరి.

"అది సెప్పేదేటే నీకు! అది సెప్తే ఒకటి– నేను సెప్తే ఒకటేనా? ఇక ఎక్కువ మాట్లాడక త్వరగా లెములు?" గట్టిగా అరిచాడు వెంకయ్య.

తండ్రి కోపం, తల్లి మౌనం— తను తండ్రితోపాటు వెళక తప్పదని తెలియజేస్తుంటే—

"అమ్మా! నేను చదువుకుంటానమ్మా! నన్ను స్కూలు మాన్పించకమ్మా!" అంటూ బావురుమని తల్లి వడిలో తలదాచుకుంది సుందరి.

"ఎందుకే ఆ ఏడుపు! ఎవరో సచ్చినట్లు ఏడుత్తున్నావు! లెగు! లెగు!" కస్సుమన్నాడు వెంకయ్య.

"లెగమ్మా! లెగు! మీ అయ్య సెప్పినట్లు యినుకో!" అంటూ కూతురును బలవంతంగా తన వడి నుంచి లేపింది రాములమ్మ.

"ఇదిగోనే సుందూ! ఈ కొత్త చీర కట్టుకో! ముఖం కడుక్కొని పౌడరస్కో! కళ్లకు కాటు కెట్టుకో! సాల శుభ్రంగా వుండాలి! తెల్సిందా! లేకుంటే మన టీ బండికేసి ఎవరూ రారు!" సుందరి వైపు చూస్తూ అన్నాడు వెంకయ్య.

తండ్రి అందిస్తున్న కొత్తచీర వైపు పిచ్చిదానిలా చూసింది సుందరి.

"నువ్వు బయటికెళ్ళయ్యా! నేను కట్టిత్తానులే!" అంటూ వెంకయ్య చేతిలో నుండి చీరందుకుంది రాములమ్మ.

## ఏటవాలు విమానాశ్రయాలు : బాలుని ప్రతిభ!

విమానాశ్రయాలను చదునుగా వుండే ప్రదేశాలలోనే ఎందుకు నిర్మించాలి? ఏటవాలుగా వుండే ప్రదేశాలలో ఎందుకు నిర్మించరాదు? ఇవి పశ్చిమ జర్మనీలో 12 సంవత్సరములు వయసుగల ఒక స్కూలు విద్యార్థికి ఏర్పడిన సందేహాలు. వీటిని నివృత్తి చేసుకొనడానికి వెంటనే ఒక మాదిరి విమానాశ్రయాన్ని నిర్మించి పరిశోధనలను సాగించాడు. ఈ పరిశోధనా ఫలితాలు అందరిని ఆశ్చర్య చకితుల్ని చేశాయి. రన్‌వేలను 10 డిగ్రీలు ఏటవాలులో నిర్మించితే, యింధనాన్ని పొదుపు చేయవచ్చు, చిన్న చిన్న రన్‌వేలు సరిపోతాయి. అంతేగాక, వాటిని పొడిగా వుంచేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయనవసరం లేదు. ఈ పరిశోధనా ఫలితాలు పైలట్లుకు, మ్యూనిచ్ విమానాశ్రయ అధికారులకు ఆమోదయోగ్యంగా వున్నాయి.

బాల బాలికల్లో గుప్తంగా వున్న పతిభను గుర్తించేందుకు పశ్చిమ జర్మనీలో గత 15 సంవత్సరాలుగా "యూత్ రీసెర్చి కాంపిటీషన్స్"ను నిర్వహిస్తున్నారు. లెక్కలు, ఫిజిక్సు, బయాలజీ, స్పేస్ రీసర్చి మొదలగు వానిలో పరిశోధనలను ప్రోత్సహిస్తున్నారు. ఈ సంవత్సరం, యిటీవల జరిగిన పోటీలలో అందర్ని ఆకర్షించిన యీ చిన్నారి ప్రతిభకు చక్కని బహుమతినందజేశారు




**లేబిల్ చింపేయండి**
**ఇంట్లోపెట్టిన ఊరగాయ**
**అనే అనుకుంటారు.**

అవును మరి ఎందుకనుకోరు? ఇంట్లో పెట్టుకున్న ఊరగాయలకుండే సహజ సువాసన, రుచి జయ ఊరగాయలకే ఉన్నాయి. కారణం ఏమిటో తెలుసా? జయ ఊరగాయలు మాత్రమే సాంప్రదాయికంగా ఇంట్లో పెట్టుకున్నట్టు చేతితోనే తయారు చేయబడ్డాయి. ఇందులో రెండు రకాల కారప్పొడి కలిసి వుంది, ఒక పొడి రంగునిస్తే మరో పొడి ఘాటైన రుచి నిస్తుంది. అంతేగాక ఇతర దినుసులు కూడా సరియైన పాళ్ళలో వైవిధ్యము, అనుభాగము మేళవించి కలిపేరు.

అందరికీ నచ్చే జయ - అందరూ మెచ్చే ధర 500 గ్రాముల మామిడికాయ పచ్చడి సీసా రు. 9-75* మాత్రమే. 1 కిలో పెద్ద సీసా రు. 14-75*. [illegible] అసలు పేరు జయ. అవకాయ, నిమ్మకాయ, వెల్లుల్లి, పచ్చిమిరప, కొబ్బరి, కలగలుపు కూరగాయలు, మామిడి క్రొత్త రకాలకు పెట్టింది పేరు జయ!

**jaya**
**PICKLES**
**జయ ఊరగాయలు**



* అమ్మకపు పన్ను ప్రత్యేకము స్థానిక పన్నులు అదనము.

తయారు చేయువారు:
పాన్ జవ్ వైన్ ఫుడ్స్ & గూడ్స్ (ఇండియా), 1-10-72/6,
బేగంపేట, మెయిన్ రోడ్, హైదరాబాద్-500 016.


## రాలిన కుసుమం

"త్వరగా కానీ!" అంటూ బయట కెళ్ళాడు వెంకయ్య.

"కట్టుకోవే తల్లీ! మీ అయ్య తల్సు కుంటే జరిగితీరాల్సిందే! నువ్వు కొట్టుకాడ నిల్సుంటే మంచి బేరాలు వస్తాయంటడు! నాలుగు రోజులు మీ అయ్య మోజు తీరనీ! అనుబవిత్తేగాని ఏటీ తెలియదు! రాత్రి వద్దన్నానని వీపు విమానం మోత మోగించాడు! మీ అయ్య సంగతి తెల్సిందేగదే!" అంటూ కూతురును బతిమాలుతూ ఆమెకు చీర కట్టసాగింది రాములమ్మ.

తన వంటికి చుట్టుకుంటున్న కొత్త చీర పాముకుసంలా అన్పించి వళ్ళంతా ఝల్లుమంది సుందరికి. ఇక తన చదువు అయిపోయింది!. తను కన్న కలలన్నీ కాలిపోయాయి! బాగా చదువుకుని ఉద్యోగం చెయ్యాలనుకుంది! ఉబికివస్తున్న కన్నీటిని ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ ముఖం కడుక్కొని పౌడరుడబ్బా అందుకుంది సుందరి. దాని సువాసన గుడిసెంతా అలుముకుంది. ఇంతవరకూ పౌడరు వాడి ఎరుగదు సుందరి. మంచి సువాసనైన పౌడరంటే సుందరికి ఎంతో యిష్టం. కాని వారి ఆర్థిక పరిస్థితినిబట్టి సుందరి తన కోరికలకు స్వస్తి చెప్పేసింది. కాని యిప్పుడు ఈ పౌడరు సుగంధాలు సుందరిని సంతోషంలో ముంచెత్తడంలేదు. కడుపులో తిప్పుతున్నట్లుగా వుంది ఆ వాసన. నిజమే! సంతోషంగా తమ కిష్టమైనది అనుభవించడం వేరు. దుఃఖంలో వున్నప్పుడు వింత కోరుకున్నది లభ్యమైనా దానికి విలువా వుండదు, అనుభవించాలనే తపనా వుండదు. దుఃఖంలో వున్న సుందరి మనసులో ఒక్క చదువుకు తప్ప దేనికీ స్థానం లేదు. కాని అదే ఆమెకు దూరమైంది. యాంత్రికంగా తండ్రిచెప్పినట్లుగా ముస్తాబయి గుడిసె బయటికి వచ్చింది సుందరి.

బయటకు వచ్చిన సుందరిని పరీక్షగా చూశాడు వెంకయ్య. కొత్తచీరలో అప్సరసలా వుంది సుందరి. కొద్దిగా ఎర్రజీరలు అలుముకున్న కళ్ళకు కాటుక వింత అందాన్నిస్తూంది. నుదుట ఎర్రని తిలకం మెరిసి పోతూంది. సుందరి తండ్రివంక చూడటంలేదు! స్కూళ్ళకు వెళుతున్న పిల్లలను చూస్తూ

"అదృష్టవంతులు" ఆసక్తిగా చూస్తూ నిలుచుంది.

వెంకయ్య లోపలికివెళ్ళి పాలగిన్నె, టీ పొడి డబ్బా, కుంపటి, బొగ్గుల డబ్బా, రెండు చిన్న పాత్రలు, యింకా అవసరమైన వన్నీ టీ బండిలో సర్ది "పద! పద!" అంటూ బయలుదేరాడు. మరబొమ్మలా అతని వెనకే నడిచింది సుందరి

* * *

వెంకయ్య తన టీ బండిని ఆ వూరిలో రద్దీగావుండే ప్రదేశంలో నిలబెడతాడు. బండి నిలబెట్టే ప్రదేశానికి ఎదురుగా ఓ సినిమా హాలు, కుడివైపు సందులో సుందరి చదువుకునే స్కూలు, ఎడమవైపు ఓ దేవాలయం వున్నాయి. అది మెయిన్ రోడ్డుకి, బజారుకు వెళ్ళేదారి. అక్కడే కొద్దిగా ముందువైపుకి ఓ కుళ్ళు కాలువ వుంది. అక్కడే మోరీ దగ్గర ప్రతి బస్సూ ఆగుతూ వుంటుంది. ప్రయాణీకులు, కండక్టర్లు, డ్రైవర్లు వెంకయ్య బండిదగ్గర టీ తాగుతారు. పల్లె పట్నం కాని ఆ వూరులో అది కొద్దిగా రద్దీగా వుండే ప్రదేశం అని చెప్పుకోవచ్చు.

వెంకయ్య టీ బండి దగ్గర, గుడి దగ్గర అడుక్కునేవాళ్ళు, సినిమా హాలులో పనిచేసే నౌఖర్లు, సినిమాకు వచ్చే కొంత మంది జనం కూడా టీ తాగుతూ వుంటారు. ఎంత కష్టపడ్డా తన బండి దగ్గరకు ఎక్కువ మంది మనుషులు రావడంలేదు. అందుకే సుందరి అక్కడ నిలబడి, సుందరి చేతో టీ యిస్తే ఎక్కువమంది టీ బండి దగ్గరకు వస్తారు. తన వ్యాపారం బాగా సాగుతుందని వెంకయ్య ఆలోచన.

వెంకయ్య బండి ఆపి గబ గబా స్టౌ వెలిగించి టీ తయారు చేశాడు. సుందరి బొమ్మలా నిలబడి చూస్తూంది. స్కూలుకు వెళుతున్న కొందరమ్మాయిలు సుందరిని విచిత్రంగా చూశారు. సుందరి కళ్ళు వాలిపోయాయి. వాళ్ళ కళ్ళల్లో తన్ని స్తున్న ఆశ్చర్యం, అవహేళన సుందరిని తల వంచుకునేలా చేశాయి. గుడి దగ్గర వుండే అడుక్కునే వాళ్ళు, సినిమాహాలు దగ్గర పని చేసేవాళ్ళు కూడా సుందరిని వింతగాచూస్తున్నారు. అందరూ తనని పరీక్షగా చూస్తూ వుంటే సిగ్గుతో నిస్సహాయంగా ఒక్క అన్నం కూడా తినలేని బొమ్మలా నిలు

చుండిపోయింది సుందరి. నలుగురైదుగురు బండి దగ్గరకు వచ్చారు.

"ఇదిగో సుందరీ! ఈ టీ వాళ్ళకివ్వు!" అంటూ సుందరి చేతికి టీగ్లాసులందించాడు వెంకయ్య

తల దించుకునే వెంకయ్య చేతి నుండి గ్లాసులందుకుని వచ్చినవారికి అందించింది సుందరి. వచ్చినవాళ్ళు టీ తాగుతున్నారనే కన్నా సుందరి అందాన్ని కళ్ళతోనే తాగేస్తున్నారనడం సమంజసం.

అందులో ఒకాడు "నీ కూతురా!" అన్నాడు వెంకయ్య నుద్దేశించి.

"అవునయ్యా! నా పెద్ద కూతురు!" గర్వంగా అందరివంకా చూస్తూ చెప్పాడు వెంకయ్య.

సుందరి మరింతగా తల దించేసుకుంది. వాళ్ళ చూపుల్లో తన శరీరాన్ని తడిమే స్పర్శ అంటే "అలనాడు భూమి బద్దలయి సీతాదేవి భూదేవి ఒడిలోకి వెళ్ళిపోయినట్లు తనూ వెళ గలిగితే బాగుండును" అను కుంటూ వచ్చే కన్నీటిని బలవంతాన రెప్పల చాటున దాయలేక అవస్థ పడుతూంది సుందరి.

టీ తాగడానికి చాలమందే వస్తున్నారు. అందరూ సుందరిని పరీక్షగా చూస్తూనే వున్నారు. సుందరి ముఖంలో ఏ భావంలేదు. తండ్రి అందిస్తున్న టీ గ్లాసులు అందరికీ అందిస్తూంది. ఎవరివంకా చూడటం లేదు. సుందరి చూపుల్లో చూపు కలపాలని ప్రయత్నించినవారు చాల నిరాశపడ్డారు.

ఒంటిగంట వరకు సుందరి రావడం వల్ల రోజుకన్నా ఆ రోజు వెంకయ్య టీ వ్యాపారం జోరుగా సాగిందనే చెప్పాలి. స్కూలు వదలి

పెట్టారు. గుంపు గుంపులుగా అమ్మాయిలు యిళ్ళకు వెళుతున్నారు. వాళ్ళలో సుందరి క్లాసమ్మాయిలు కూడ వున్నారు. అందరూ సుందరిని వింత జంతువును చూస్తున్నట్లుగా చూసి వెళుతున్నారు. కొందరు ముసి ముసిగా నవ్వుకుంటూ గుసగుసలాడుకుంటున్నారు. ఇళ్ళకు వెళుతున్న స్కూల్ మేడమ్స్ కూడ తనని చూసి నవ్వుకోవడం గమనించింది సుందరి. "హవ్వ! సిగ్గన్నాలేదు ఈ పిల్లకు! అలా బజారులోనిలబడి టీ అమ్ముకుంటూంది. ఈ అమ్మాయి మా క్లాసమ్మాయే! చూడు! చూడు! ఎలా తయారయిందో! కొత్త చీర! కొత్త బ్లౌజు! అబ్బో!" అంటూ ఓ అమ్మాయి యింకో క్లాసమ్మాయితో అంటూంది. ఇద్దరూ నవ్వుకుంటున్నారు. వాళ్ళు చిన్నగా మాట్లాడుకున్నా ఆ మాటలు సుందరి చెవిన పడ్డాయి.

"తనకు సిగ్గులేదా! తనెంత సిగ్గుపడుతూందో, మనసులో ఎంత బాధపడుతూందో వీళ్ళకు తెలుసా! తెలీదు! తెలుసుకోలేరు. ఉన్నవాళ్ళు! గొప్పవాళ్ళు! తనలా వాళ్ళు దరిద్రంలో పుట్టలేదు. తనలాంటి తల్లి, తండ్రి వాళ్ళకు లేరు. తనలాంటి దురదృష్టవంతులు వాళ్ళు కారు! అందుకే వాళ్ళకేమీ తెలీదు! తను చెప్పినా నమ్మరు! తనను సిగ్గులేనిదానికింద జమకట్టేశారు! రోజూ అయితే తనూ ఈ పాటికి స్కూలునుండి ఆనందంగా యింటికి తిరిగి వచ్చేది! ఇక తనకా అదృష్టం లేదు!" ఆపుకోలేని కన్నీరు కట్టలు తెంచుకుని ముందుకురికి సుందరి బుగ్గలమీదుగా జారిపోయాయి. తండ్రి చూస్తే తిడతాడని గబగబా కళ్ళు తుడుచుకుంది సుందరి.



శాస్త్రప్రయోగము • నపుంసకత్వము

సెక్సు హాస్పిటల్



వివాహితులకు లోపించిన దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే సంప్రదించండి!

డా॥ A. పూర్ణచంద్రరావు
(సెక్సు స్పెషలిస్టు) N.D.F.N.F.U.(CEYLON) R.A.M.P.
గవర్నరుపేట, మెయిన్ రోడ్, విజయవాడ-2 (A.P.)

సుఖవ్యాధులకు ప్రత్యేక చికిత్స

Phone No. : 63753

స్వీట్ అండ్ న్యూ సంక్రాంతి కార్డుల సెట్లు
చూపు రమణీయ రూపకల్పన
వినియోగదారులకు
6 కార్డులు (6 రకాలు) రు. 9-00
డీలర్లకు ప్రత్యేకం
24 కార్డులు (8 రకాలు) రు. 24-00
మనియార్డర్ గాని పోస్టల్ ఆర్డర్ గాని పంపితే రిజిష్టరు పోస్టులో పంపుతాము. వి.పి.పి. లేదు.
SA-2
**Cards Crafts Classics**
12-E Byramjung Bhahadur Lane
Post Box No. 2421, Madras-600 002

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్ వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు
★ స్కూలు యూనిఫారంలు ... వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షో రూమ్
ఐ.డి. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట......విజయవాడ-2.

# రాలిన కుసుమం

"పదవే సుందూ! ఇంటికెళదాం! మళ్ళా వద్దాం" అంటూ టీ బండి తోసుకుంటూ ముందుక్కదిలాడు వెంకయ్య. సుందరి వెంకయ్యను అనుసరించింది.

* * *

వెంకయ్యకు చాలా ఆనందంగా వుంది. సుందరి రావడంవల్ల మంచి లాభం వస్తూ వుంది. చాలమంది టీ తాగుతున్నారు. సుందరి మాత్రం మనసులో నిశ్శబ్దంగా ఏడుస్తూంది.

తండ్రి వెంట వెళ్ళక తప్పడంలేదు సుందరికి. అందరి చూపులు భరించక తప్పడంలేదు. టీ బండి దగ్గర నిలుచున్నంత సేపు సుందరి తల ఎత్తదు. ఆమె ముఖంలో నవ్వుండదు. ఆమె ముఖంలో ఎప్పుడూ నిరాశ, నిస్పృహ. ఎప్పుడైనా కనులెత్తి చూసినా ఆ చూపులు ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ వుంటాయి. ఆమె కళ్ళలో ఎప్పుడూ అంతులేని ఆవేదన కన్పిస్తూంటూంది. పదహారేళ్ళ కన్నెపిల్ల కుండాల్సిన సంతోషం, ఉత్సాహం అన్నీ తండ్రి వల్ల పోగొట్టుకుంది సుందరి.

ఆ పిల్ల మగవాళ్ళ చూపులకు అర్థం తెలుసుకునే వయసులోనే వుంది. తండ్రి తన వ్యాపారానికి తనని ఓ బొమ్మలా ఉపయోగించుకోవడం మెచ్చలేకపోయింది. కాని ఆ విషయం తండ్రితో చెప్పే ధైర్యం సుందరికి లేదు. తను మాట వినకపోతే తండ్రి కోపంతో తల్లిని బాదేస్తాడు. ఇల్లంతా నరకంగా మారుతుంది. చిన్నప్పటి నుండి తల్లీ, తండ్రీ తిట్టుకోవడం కొట్టుకోవడం చూస్తూనే వుంది సుందరి. చూసి చూసి ఓ విధమైన అసహ్యాన్ని కూడ పెంచుకుంది. ఇంటి పరిస్థితులు మర్చిపోవడానికి చదువొక వ్యాపకం కింద పెట్టుకుంది. బాగా చదువుకుని ఉద్యోగం చెయ్యాలి. చక్కగా అందరిలా సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలని సుందరి నిశ్చయించుకుంది. కాని వెంకయ్య ఆమె ఆశలు ఒక్కసారే కూల్చేశాడు. ఇప్పుడు సుందరి రావంటే భార్యను వప్పించమని బాదేస్తాడు. తన వల్ల తల్లి దెబ్బలు తినడం సుందరికి యిష్టంలేదు. అందుకే తండ్రి వెంట గంగిగోవులా వెళుతూంది. ఆమె పరిస్థితి గురించి వివరాలోచిస్తారు. సుందరి యిష్టంగా ఆ పని చేస్తూందని సుందరి స్కూలమ్మాయిలు, మేడమ్స్ నవ్వుతున్నారు. మాటలు విసురుతున్నారు. రోడ్డు మీద కుర్రకారు ఈలలు వేస్తున్నారు. కన్నుకొడుతున్నారు. ఇవన్నీ భరిస్తూ సుందరి ఎంత నరకయాతనకు బలవుతూందో ఎవ్వరికీ అక్కర్లేకపోయింది లోకం గురించి పట్టించుకోకూడదు అంటాడు వెంకయ్య. కాని సున్నితమైన మనసు గల సుందరి లాంటి వ్యక్తులు బాధపడకుండా ఎలా వుండగలరు!

ఆరోజు టీ పొడి అయిపోవడంతో సుందరిని బండిదగ్గరవుంచి మెయిన్‌రోడ్డులో వుండే షాపుకేసి వెళ్ళాడు వెంకయ్య. ఈ అవకాశం కోసమే చూస్తున్న కిళ్ళీషాప కిష్టయ్య టీ కావాలంటూ టీబండి దగ్గరకు వచ్చాడు.

ఉన్న కాస్త డికాషన్‌తో టీ కలిపి యిచ్చింది సుందరి.

"టీ చాల బాగుంది సుందరీ! నీలానే వుంది" అన్నాడు కిష్టయ్య.

సుందరి తల ఎత్తలేదు. కిష్టయ్య మాటలు విన్పించుకోలేదు.

"సుందరీ! నువ్వు చాల బాగుంటావ్! అచ్చు సినిమాస్టార్‌లా వుంటావు! తెలుసా!" వెకిలిగా నవ్వాడు కిష్టయ్య.

కిష్టయ్య ధోరణి శ్రుతిమించుతూందని, ఊరుకుంటే లాభంలేదని తలెత్తి కోపంగా చూసింది సుందరి.

"అబ్బ! నీ కళ్ళు ఎంత అందంగా వున్నాయో తెలుసా?" అన్నాడు కిష్టయ్య సుందరి కళ్ళల్లోకి చూస్తూ.

"ఛీ! నోర్ముయ్!" చీదరించుకుంది సుందరి.

"ఏమిటే! ఎంత పొగరే! నన్నే ఛీ అంటావా! మహా అందగత్తెనని మిడిసిపడుతున్నావ్! నీ సంగతి, నీ అయ్య సంగతి ఎవరికి తెలీదే! పగలు వ్యాపారం, రాత్రి ఆ వ్యాపారం! మహా జోరుగా వుందే నీ వ్యవహారం! ఎవరికీ తెలీదనుకుంటున్నావ్ గాబోలు! మహాస్టయిల్ జేస్తున్నావు" గట్టిగా అన్నాడు కిష్టయ్య.

"ఏమన్నావ్! నీకు సిగ్గుందా! మా అయ్య లేకుండా చూసి వాగుతున్నావా! నిన్నూ..." కసిగా పళ్ళు కొరికింది సుందరి. అతని మాటలకు సుందరికి అంతులేని కోపం వచ్చింది.

నూతన సంవత్సర ప్రత్యేక కానుక
రు. 18 లకు 4 బ్యాండ్ల ట్రాన్సిస్టర్ రేడియో పొందండి

రు. 310 విలువగల ఆధునిక జపాన్ మోడల్ ఏ.సి. కం—బ్యాటరీ సూపర్‌ఫైన్ జెనీవా 4 బ్యాండ్ ట్రాన్సిస్టర్ రేడియో రు.170లకు లభిస్తుంది. అంయితే మీరు ఉచితంగా స్టీరియో—హై—ఫై—రికార్డింగ్ లీడ్‌తో కేవలం రు. 18 లకే పొందగలరు. అన్నిటికంటే మొట్టమొదట అందుకోబడ్డ ఆర్డరునకు పొటోగ్రాఫిక్ కెమేరా ఇవ్వబడుతుంది. ఇంగ్లీషు లేక హిందీలో మీ ఆర్డరును పంపి నిజాన్ని పరీక్షించండి.
OLYMPIC TRADERS (O—40)
Post Box No: 9425, Delhi—51

**WANTED**

ప్రభుత్వ కార్యాలయములందు, బ్యాంక్‌లందు క్రింది ఉద్యోగవులు పొందుటకు ఇచ్చు శిక్షణకు ధరఖాస్తులు కోరబడుచున్నవి.

| పని పేరు | అర్హత | ఖాళీలు | శిక్షణా విభాగము |
|---|---|---|---|
| **A/c. Assistants** | **S.S.C.** | **340** | **Accountancy** |
| **A/c Supervisors** | **Inter** | **120** | **D. om.** |
| **Clerks, Cashiers** | **Degree** | **300** | **Banking.** |
| **Managers** | **Degree** | **80** | **Management.** |

**Training period : 3 to 6 Months** (ఆయా కోర్సులకు తగినట్లు) **Salary : Rs. 460/- 850 -** వరకు పొందుటకు అర్హులు. శిక్షణా కాలములో **Rs. 150 Scholarship** లభించును. హాస్టల్‌గదులు ఉచితంగా ఇవ్వబడును. **C. A; I. C. W. A.** చదువుటకు కూడా ఇది మార్గదర్శకముగా నుండును. **Application Form & Prospcctus** కొరకు రు. 3 ఎం. ఒ. లేక **Crossed Postal Order** పంపిపొందవచ్చును. **N.B.** పోస్టల్‌మూలముగా కూడా ఈ శిక్షణలభించును. **Principal, Technical Examinations Training College, P.H.Road, Madras-600107.**

క్లాసులు ప్రారంభమయినవి.
1981 ఫిబ్రవరి 21, 22 తేదీలలో 6వ తరగతిలోనికి ప్రవేశ పరీక్షలు జరుగును.
సైనికస్కూలు : కోరుకొండ (ఎ పి.)

* బాలుర వయస్సు 1981 జూలై 1 వ తేదీనాటికి 10–12 సం. మధ్య నుండవలెను. డిఫెన్సులోని, ఎక్సు సర్వీసు ఉద్యోగుల, సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులముల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు.
* కోరుకొండ సైనిక స్కూలుతో సమానముగా ప్రారంభించి, చక్కటి హాస్టలు వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణ భారత దేశము నందలి ప్రప్రథమ విద్యా సంస్థ.


శ్రీ విద్యా విహార్ ఫోన్: 22084
"ఆదర్శ గురుకుల విద్యాసంస్థ"
లలితానంద నగర్, రింగ్‌రోడ్ గుంటూరు—6

నర్సరీ నుండి మెట్రిక్ వరకు ఇంగ్లీషు తెలుగు మీడియంలో క్లాసులు కలవు.

# రాలిన కుసుమం

"ఏంచేస్తావే! నీ సంగతి ఎవరికి తెలీదని. వ్యాపారం పేరుతో మీ అయ్య యిక్కడెందుకు నిలబెట్టాడో తెలీదనుకోకు! అదిగో ఆ సినిమాహాలు వోనరు మంచి రసికుడే! నీకు తెలీకుండా వుందా! ఆడిని బట్టాలని, అయ్య కూతురు యిద్దరూ ప్లానేశారు! బాగా డబ్బుంది గదా! మాలాంటోళ్ళు నీకు పనికి రారే! కానీ సుందరీ! పట్టాలనుంటే మాలాంటోళ్లనే పట్టుకో! పర్మనెంటుగా వుంచుకుంటారు! ఆడిలాంటోళ్ళను పట్టావా! ఆ మూల కూచుందే ఆ పిచ్చిది, దానిగతే నీకూ పడుతుంది! మిడిసిపడమాకు! మహా అందగత్తెననుకుంటున్నావ్! కాళ్లకాడ కొచ్చినోడిని పొమ్మంటున్నావ్! నువ్వేమవుతావో నే చూడకపోను! హు!" అంటూ టీ గ్లాసు దబ్బున చప్పుడు చేస్తూ పెట్టి, అందులోనే డబ్బులు పడేసి పోయాడు కిష్టయ్య విసవిసా నడుచుకుంటూ.

"ఆ పిచ్చిదానిగతే నీకూ పడుతుంది! ఆ పిచ్చిదాని గతే నీకూ పడుతుంది!" కిష్టయ్య అన్న మాటలో కెల్లా ఆ ఒక్కమాటే వేయి గొంతుకలో విన్పిస్తున్నట్లుగా వినిపించి, కళ్ళు తిరుగుతున్నట్లయి, తూలిపడబోయి టీ బండిని పట్టుకొని ఆగింది సుందరి

"ఆ సినిమా హాలు వోనరు మంచి రసికుడే! ఆడిని పట్టాలనే ప్లానేశారు" కిష్టయ్య గొంతు యింకా విన్పిస్తూన్నట్లుగానే వుంది సుందరికి.

టీ ప్యాకెట్టు తెచ్చిన వెంకయ్య "ఎవరేనా వచ్చారా?" అని అడిగాడు సుందరిని. సుందరికి తండ్రి అడిగింది విన్పించలేదు. ఆమెకేమీ విన్పించడంలేదు, ఒక్క కిష్టయ్య కంఠం తప్ప! ఆమె కేమీ కన్పించడంలేదు ఒక్క పిచ్చిది తప్ప.

సినిమాహాలు బయట ఓ మూల కూచున్న పిచ్చిదాన్నే చూస్తూంది సుందరి. ఆ పిచ్చిదాని గురించి సుందరికి తెలిసిన కథ— ఆ పిచ్చిది ఒకప్పుడు సినిమా హాలులో పని చేసే పనివాడి కూతురు. తండ్రికి జబ్బు చేస్తే డబ్బు అడగడానికి వోనరు దగ్గరకు వెళ్తే, ఆడదంటే నళ్లు మరచే ఆ వోనరు ఆ అమ్మాయిని పాడుచేశాడని, షాక్ వల్ల ఆ అమ్మాయి పిచ్చిదైపోయిందని, యిది చూసిన ఆమె తండ్రి చనిపోయాడని దిక్కు

ధర్మపథం

## క్షమాభిక్ష

— బులుసు వేంకటరమణయ్య

దుష్టులను నిగ్రహించి శిష్టులను రక్షించుటకున్నూ, భూభారాన్ని తగ్గించుటకున్నూ భగవంతుడు కృష్ణుడుగా అవతరించిన సంగతి అందరికీ తెలుసును. శ్రీకృష్ణుడు పసిబాలుడుగా ఉన్నప్పుడే పూతనను చంపినాడనీ, బాల్యంలోనే పెక్కుమంది రాక్షసులను హతమార్చెననీ గ్రంథాల వల్ల తెలుస్తున్నది. యమునా జలాన్ని విషపూరితం చేసి, ఆ జలాన్ని పానం చేసే ప్రాణులు మరణించేటట్లు చేస్తున్న కాళియుణ్ణి చంపక— ఆ స్థలం విడిచిపొమ్మని చెప్పడం వింతగా తోచవచ్చు. ఆ సర్పం తన్ను చాలా బాధించింది కూడాను కాళియునిపట్ల మాత్రం అంత దయ ఎందుకుండాలి? ఈ సందేహం కొందరికయినా కలుగకపోదు. దీనికి సమాధానం లేకపోలేదు.

శ్రీకృష్ణుడు కాళియుణ్ణి మర్దించి కంఠగత ప్రాణుని చేసినప్పుడు— అతణ్ణి రక్షించాలని కాళియుని భార్యలు ప్రార్థించారు. తప్పులు క్షమింపగోరారు. అంతే కాకుండా కాళియుడు కూడా భగవానుని స్తుతించి తనకు ప్రాణభిక్ష కోరాడు. అతడు యుక్తి యుక్తంగా — చమత్కారంగా మాటలాడి శ్రీకృష్ణునికి సంతృప్తి కలిగించాడు. ఆ మాట లివి—

"దేవ దేవా! సృష్టి స్థితి లయాలకు నీవే కారణం. నీవు సర్పజాతిని సృజించావు. ఆ జాతికి దుష్ట స్వభావం కలిగించినదీ, విషం ఏర్పరచినది నీవే కదా! నీవు నన్ను సర్పజాతిలో పుట్టించావు. జాతి స్వభావాన్ని బట్టి ఆ దుష్టత్వం నాకు కలిగింది. పాములు ఎలా నడుచుకోవలెనో నీవు చేసిన నిర్ణయాన్ని బట్టి అనుసరించే నేను నడుచుకొన్నాను. ఇందులో నా తప్పు ఏమున్నదో నీవే ఆలోచించు. నన్ను అజ్ఞునిగా సృజించావు. దానికి తగినట్లుగానే ప్రవర్తించాను. నా తప్పునకు తగిన శాస్తి చేశావు. నన్ను చావ గొట్టావు. ఈ శిక్ష చాలును. ఇతరుల వల్ల వరం పొందడం కంటె నీ వల్ల దండన పొందడమే ఎంతో మేలు. నేను నీ దండన పొంది ధన్యుడనైనాను. నన్ను ప్రాణాలతో విడిచి పెడితే— నీ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాను."

ఈ మాటలు శ్రీకృష్ణునికి సంతృప్తిని కలిగించాయి. అందువల్ల అతడు కాళియుని చంపక— ఆ చోటు విడిచి సముద్రంలోకి పొమ్మన్నాడు. తన పాద చిహ్నాలు పడగపై ఉన్నందున— వానిని చూచి గరుడుడు హింసించడని కూడా అభయం ఇచ్చాడు.

భగవానుని విరోధించిన దైత్య దానవులు క్షమాభిక్ష కోరక ప్రాణం పోయే వరకూ వైరం సాధించినందున నశించిపోయ్యారు. క్షమాభిక్ష కోరడం వారి స్వభావానికే విరుద్ధం.

---

వరూ లేకపోవడం వల్ల ఆమెను ఎవరూ ఆదుకోలేదని, ఆ పిల్ల ఆ పిచ్చిలో నగ్నంగా బట్టలు విప్పుకుని తిరుగుతూంటుందని, ఎవరైనా గుడ్డలు యిచ్చినా, అవి ఎలా కట్టుకోవాలోకూడా తెలియనటువంటి పిచ్చిలో ఆ బట్టలు ముఖంమీద వేసుకుని ఏడుస్తూ కూచుంటుందని అనుకోవడం విన్నది సుందరి. ఈ కథలో నిజమెంతో సుందరికి తెలీదు. అందరూ ఆ పిచ్చిదాని గురించి అలాగే చెప్తారు. అదే సుందరికీ తెలుసు. ఆ పిచ్చిది నగ్నంగా తిరగడం స్కూలుకు వెళ్తూ చూసేది. ఒకటి రెండుసార్లు సినిమాహాలు వైపు వేలెత్తి చూపుతూ ఏడుస్తూ, నవ్వుతూ, గొణుక్కుంటూ వుండడం సుందరి చూసింది. ఆపిచ్చిదానివైపు జాలిగా చూసేది. అప్రయత్నంగానే ఆమె కళ్లల్లో నీరు తిరిగేది. పాపం! అనుకునేది. కిష్టయ్య మాటలు సుందరిమీద బాగా పనిచేశాయి. ఆమె మనసంతా పిచ్చిదే నిండిపోయింది.

"తనుకూడ అలా అయిపోతుందా! తండ్రి తనను కిష్టయ్య చెప్పిన కారణానికే ఇక్కడ నిలబెడుతున్నాడా! తన తండ్రి అంత చెడ్డవాడా! తనను గురించి అందరూ ఇలా అనుకుంటున్నారా! తనసలు ఎవరింటికీ వెళ్లడం లేదు, ఎవరితో మాట్లాడడం లేదు. తనకెలా తెలుస్తుంది, ఎవరేమనుకుంటున్నారో! అందరి నవ్వులకూ అర్థం యిదా! నిజమా! భగవాన్! తను కూడ ఆ పిచ్చిదానిలా నగ్నంగా వీధులవెంట తిరుగుతుందా! కిష్టయ్య అన్నట్లుగా తను కూడా అలా అయిపోతుందా! కిష్టయ్య చెప్పినట్లుగా తండ్రి మనసులో కూడ అదే వుద్దేశ్యం వుందా!" అనుకుంటూ వణకిపోయింది సుందరి. ఆ చిన్నారి లేత హృదయం కిష్టయ్య మాటలతో బాగా దెబ్బ తినింది. కళ్ళు మూసినా, తెరచినా పిచ్చిదాని రూపు సుందరిని కలవర పెట్టసాగింది.

* * *

ఆ రాత్రి సుందరికి నిద్ర కరువైంది. "తండ్రి మనసులో ఏముందో? కిష్టయ్య చెప్పింది నిజమేనేమో! తనకా ఆలోచనేరాలేదు. ఆ వోనరు ఈపాటికి తననుచూసేవుంటాడు. అమ్మయ్యో! డబ్బు కోసమేగదా తండ్రి తనను రమ్మంటున్నాడు! ఆ వోనరు డబ్బున్నవాడు గదా! ఎక్కువ డబ్బిస్తానంటే తన తండ్రి అతడికి తనను అప్పజెప్తాడేమో! అప్పుడు తను కూడా ఆ పిచ్చిదానిలా అయిపోతుందా! రేపట్నుంచి వెళ్లడం మానేస్తే! అయ్యో వూరుకుంటాడా! కిష్టయ్య ఎంతఅసహ్యంగా మాట్లాడాడు. తమను గురించి. అందరూ అలా అనుకుంటున్నారని తల్లిదండ్రులకు తెలిసే వుంటుంది. తెలిసే వూరుకున్నారేమో! కడుపు నిండుతావుందని లోకం గురించి మర్చిపోయారా! లోకులు కాకులని తెలిసా! ఏమైనా సరే! రేపటి నుంచి వెళ్లను" అని నిశ్చయించుకుంది సుందరి.

* * *

మర్నాడు ప్రొద్దుటే వంట్లో బాగాలేదని పడుకున్న సుందరి వళ్లు పట్టి చూస్తూ "జ్వరం లేదు! లెగు! లెగు! త్వరగా తయారవ్వు" అన్నాడు వెంకయ్య.

తనకు బాగాలేదన్నా రమ్మంటున్న తండ్రినే చూస్తూ "కిష్టయ్య మాటలు నిజమే కాబోలు! ఏమైనాసరే! వెళ్ళకూడదు" అనుకుంది సుందరి.

"లెగవే సుందూ! ఇంకా పడుకున్నావేంటి?" విసుక్కున్నాడు వెంకయ్య.

"రాలేనయ్యా!" అంది సుందరి.

"రాలేవా! ఏం తీపరమొచ్చిందే! ఒసే రాముడూ! దీని సంగతి జూడు! వళ్ళు

వెచ్చగాలేదు! వేషాలేస్తూంది! రాలేదట! రాలేదు!'' కోపంగా అరిచాడు వెంకయ్య.

రాములమ్మ సుందరి దగ్గరకు వచ్చి ఆమె వంటిమీద చెయ్యేసి చూస్తూ ''వళ్లు వెచ్చగా లేదుగదే! త్వరగా పదవే!'' అంది కడుపు నిండుతా వుంటే వెంకయ్య వెంట సుందరి వెళ్ళడం తప్పలేదనుకుంది. లోకం ఏమనుకుంటే నేం! వెంకయ్య అన్నట్టు 'నవ్వే లోకులు బువ్వెట్టరుగా' అనుకుంది. కూతురును వెళ్ళమంటూ త్వర పెట్టింది.

సుందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ''కిష్టయ్య అన్నట్టుగా వీళకు ఆ వుద్దేశ్యం వుండే వుంటుంది. అడిగేస్తే! అందరూ తమను గురించి అనుకుంటున్న మాటలు చెప్పేస్తే! అమ్మయ్యో! తండ్రి కోపంతో కొడ్తాడేమో! నీ కెవరు చెప్పారంటాడు! చిన్నప్పుడే ఇలాంటి మాటలు మాట్లాడతావా అని తల్లి తిడుతుంది!'' అనుకుంటూ అసలే భయస్తురాలైన సుందరి ఏమీ చెప్పలేక మౌనంగా తండ్రి వెంట వెళ్లింది.

*　　*　　*

సుందరి పరిస్థితి అధ్వాన్నంగా వుంది. ఆ సినిమాహాలు వోనరు సినిమాహాలు పోర్టికో వైపున్న గదిలో వుంటాడని వినికిడి. ఎక్కువగా సినిమాహాలులోనే కాలక్షేపం చేస్తాడని సుందరి వినింది. ఆ గదికి అన్నీ అద్దాల కిటికీలు అన్నిటికీ కర్టెన్స్ వేసివున్నాయి.

''ఆ కర్టెన్స్ చాటు నుండి తనను

## రాలిన కుసుమం

చూస్తున్నాడేమో! అతడు రోజూ తనని గమనిస్తూ వుండి వుంటాడు. ఈ రోజు కూడా చూస్తూ వుండి వుంటాడు.'' అనుకుంటున్న సుందరి చేతులు వణికిపోతున్నాయి. అందరికీ అతికష్టంగా టీఅందిస్తూ వుంది. కిష్టయ్య మాటలతో మొదలైన అనుమానం పెనుభూతంలా అయి సుందరిని బెదరగొడుతూంది.

అప్పటికే ఒక గాజుగ్లాసు పగిలిపోయింది రకరకాలుగా వూహించుకుంటున్న సుందరి పిచ్చిదానిలా అయిపోతూంది. వెంకయ్య ఇదేమి గమనించడం లేదు. అతడు టీ చెయ్యడం, సుందరి అందివ్వడం, డబ్బుల వసూలు చేసుకోవడంలో వున్నాడు. సుందరి చూపులు అద్దాల కిటికీల మీదే వున్నాయి ''అవిగో కర్టెన్స్ కదులుతున్నాయి. అతనే అయివుంటాడు. కనిపించ కూడదు'' అనుకుంటూ బండి చాటుకి అటూ, ఇటూ తడబాటుగా నడిచింది సుందరి.

''ఏమిటే! ఆ తిరుగుడు? ఇలా నిలుచో!'' కసురుకున్నాడు వెంకయ్య.

*　　*　　*


సుందరికి తిండి సయించడంలేదు రాత్రి పూట నిద్ర పట్టడంలేదు. ఎవరితో చెప్పకుంటుంది. చిన్నప్పటి నుండి ఎక్కువగా మౌనంగా గడిపే సుందరి తన బాధ ఎవరితోనూ చెప్పకోలేకపోయింది.

చదువుకుంటానని మళ్లీ ఓసారి అడిగిన సుందరిని తల్లీ తండ్రీ యిద్దరూ తిట్టారు. ఇక ఆ ఆశ పూర్తిగా వదులుకుంది. చూచాయిగా లోకం అనుకునే మాటలు చెప్పా లనుకుంది. కాని ''నవ్వేలోకులు బువ్వెట్టరు'' అంటూ ఎప్పుడూ అనే తండ్రికి ఎలా చెబుతుంది? అతడి మనసులోఉద్దేశ్యం చెప్తాడని నమ్మకం లేదు సుందరికి. చదువు మాన్పించి తనతోపాటు పిల్చుకెల్తున్నాడు గాబట్టి, యింకేం చెయ్యడానికైనా తండ్రి వెనుదీయడని నమ్మేసింది సుందరి. తన అందం మీద తనకే ఓ విధమైన అసహ్యం వేస్తూంది! తనను పుట్టించిన భగవంతుడిని తిట్టుకోనిరోజు వుండడం లేదు.

సుందరి చిక్కిపోతూంది. తల్లీ తండ్రీ ఆమె మానసిక వేదన గమనించలేదు. గమనించేంత సున్నితత్వం కూడ వాళ్ళలో లేదు. దరిద్రం తీరిపోతావుంది. సుందరి వెళ్లిన దగ్గర నుండి హాయిగా వ్యాపారం సాగుతూంది. కడుపు నిండుగా వుంది. కాని సుందరి మనసు అతి సున్నితమని, ఆమె మనసులో నరకయాతన అనుభవిస్తూందని గ్రహించలేదు.

కిష్టయ్య వెకిలినవ్వులు, స్కూలుకు వెళ్తూ అమ్మాయిలు గుస గుసగా చెప్పకునే కబుర్లూ, నవ్వే మేడవ్స్, కన్నుకొడుతూ వెళ్లే కుర్రకారు సుందరి ఎంత పట్టించుకోకూడదన్నా ఆమెను నిలవనీయడం లేదు. ఇంకా సినిమాహాలు ముందు తిరిగే పిచ్చిది, ఆ హాలు వోనరు తనను చూస్తున్నాడేమో! అనే సందేహం సుందరిని పిచ్చిదాన్ని చేస్తున్నాయి.

పగలు, రాత్రి ఆలోచిస్తూంది సుందరి. 'దీనికో పరిష్కార మార్గం చూడాలి! ఎలా? ఏంచెయ్యాలి?'' ఎటూ తిరిగి ఆమె ఆలోచనలు ఆ పిచ్చిదాని మీదే నిలుస్తున్నాయి. ''తనూ అలా అయిపోతుందా! అలా కావడానికి వీల్లేదు. అలా పిచ్చిదై తిరిగే కన్నా చచ్చిపోవడం మేలు. అవును! చచ్చిపోవాలి. ఈ బాధలకు, భయాలకు దూరంగా ప్రశాంతంగా వుండే లోకాలకు వెళ్ళిపోవాలి! చచ్చిపోవాలి. అప్పుడు తనను ఎవరూ ఏమీ చెయ్యలేరు. తనను చూసి ఎవ్వరూ నవ్వరు!



# డాక్టరు సలహాలు

**వి. వి. ఎన్. — మాలికిపురం**

నా వయస్సు 20 సంవత్సరములు. 6, 7 నెలల నుండి చెవులలో ఏదో ధ్వని క్రింద ఉండటం, అప్పుడప్పుడూ తలనెప్పిగా ఉండటం, తలతిరగటం, మాట వినపడకుండా ఉండటం జరుగుతోంది. డాక్టరుకి చూపిస్తే చెవిలో వేయటానికి మందులు ఇచ్చారు. అవి వాడినా ఏమీ ప్రయోజనం కనిపించలేదు. దీనికి ఏమి చెయ్యాలి?

చెవులలో శబ్దానికి కంపించే "ఆడిటరీఆసికల్స్" అనే మూడు చిన్న ఎముకలు ఉంటాయి. ఈ ఎముకలను కంపింప చేయటానికి సన్నని కండరాలు ఉంటాయి. వీటిలో కొన్ని తేడాలేర్పడినప్పుడు లేక లోచెవులలో కొన్ని రోగాలేర్పడినప్పుడు పై లక్షణాలేర్పడే అవకాశం ఉన్నది. ఈ లక్షణాలు చెవులలో డ్రాప్స్ వాడినందువల్ల నయంకావు. నిపుణులైన ఇ.ఎన్.టి. వైద్యులకి చూపెంచండి.

**ఒ. ఎస్ — విశాఖపట్నం**

మావారు ఈమధ్యనే 'వాసెక్టమీ' ఆపరేషన్ చేయించుకున్నారు. బరువులు మోస్తే ఏమైనా ప్రమాదమేమోనని నాకు భయంగనున్నది. వారు సైకిలు త్రొక్కవచ్చునా?

వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నవారు ఏపని చేసినా ప్రమాదమేమీ ఉండదు. ఆపరేషన్ చేసిన నెల, రెండునెలలపాటు సైకిల్ త్రొక్కటం అంటే ఆపరేషన్ చేసిన భాగానికి రాపిడి, ఒత్తిడి కలిగించే ఎక్సర్‌సైజు వంటివి చేయటం మానాలి. రెండు నెలల తర్వాత ఏవిధమైన పనులుకూడా ఏ భయమూ లేకుండా చేయవచ్చును.

**పి. హెచ్ — ఉలవపాడు**

మా అబ్బాయి వయస్సు 10సం.లు. 1సంవత్సరము క్రితం చెవిలో బలపము ముక్క వేసుకున్నాడు. మా వూరి గవర్నమెంటు హాస్పిటల్‌లో బలపము తీసివేసారు. అప్పటినుంచి చెవిలోనుంచి చీము కారటము మొదలయినది. చెవిలో మందులు వాడినాము. రెండు చెవుల నుండి చీము వస్తున్నది. చాలా దుర్వాసన వస్తున్నది. ఒకటికి రెండుసార్లు పిలిస్తేగాని పలకడు.

చెవులలోని మధ్య భాగము అయిన మిడిల్ ఇయర్‌లో సూక్ష్మక్రిములు చేరటం వల్ల ఈ చీము ఏర్పడుతుంది. చాలా రోజులుగా చీము వస్తూవుంటే దానికి 'క్రానిక్ సప్యురేటివ్ ఆటైటిస్ మీడియా' అని వైద్యులువ్యవహరిస్తారు.

దీనిని నిర్లక్ష్యం చేస్తే చెవు వెనక భాగంలోని "మస్టాయిడ్" ఎముకకి ఈ చీము విస్తరించే అవకాశం ఉన్నది.

చీముని తీసి 'కల్చర్ అండ్ సెన్సిటివిటి' పరీక్ష చేయించి ఆ రిపోర్టులో తేల్చబడిన మందులను చెవులలోను, ఇంజక్షన్ల రూపంలో శరీరానికి వాడవలసి ఉంటుంది.

**యస్. ఆర్ — హిందూపురము**

నా వయస్సు 40 సం.లు. 20 సంవత్సరముల క్రితం మొదట ఒకే ఒక పుండు లేచి రెండువారాలలో దానికదే మానిపోయినది. తర్వాత ఒళ్లంతా కురుపులతోనూ, తెల్లని చీముతోనూ, దురదతోనూ, అదే కురుపు లేచినది. పెన్సిలిన్, వెటిసిల్ టాబ్లెట్లు, సల్ఫాడయజిన్ వాడితే తగ్గింది. మరలా యథాప్రకారం వచ్చింది.

మీరు వెంటనే పరీక్ష చేయించుకోవటం అవసరం. రక్త పరీక్ష ఫలితాన్నను సరించిఇంజక్షన్లు క్రమంగా వాడవలసి ఉంటుంది. వి.డి.ఆర్.ఎల్. అనే [ఖాన్‌గాని వాసర్ మాన్‌గాని] పై పరీక్షవల్ల మాత్రమే రోగ నిర్ధారణ అవుతుంది. పై పరీక్ష నెగటివ్ అని తేలితే ఆ చీముని పరీక్షించవలసి ఉంటుంది.

**యస్. వి. — ఏలూరు**

మా అబ్బాయి వయస్సు ౨౦ సం.లు. ఉద్యోగరీత్యా విశాఖపట్నంవెళ్లి ఒకటిన్నర సం.లు అయినది. వెళ్లినప్పటినుండి యూరిన్ పసుపుగానూ, కళ్లు ఎర్రగా ఉంటున్నాయి. హోటల్ భోజనం వల్ల అలా ఉంటుందనుకున్నాడట. ముసదగ్గు కూడా మొదలయినది. డాక్టర్‌కి చూపిస్తే రక్త పరీక్ష చేసి 'ఇస్నోఫీలియా, 21 శాతం ఉన్నదని, అలర్జీ వల కళ్లు ఎర్రబడ్డాయని 'హెట్రజాన్ మాత్రలు రోజుకి 3చొప్పున 10రోజులకి ఇచ్చారు. నీరసంగా ఉన్నాడని 'హాటల్ బరీస్ కాంపౌండ్ ఇస్తున్నారు. అసలు ఇస్నోఫీలియా అంటే ఏమిటి? అందరికీ ఉంటుందా? ఇంకా ఈ వ్యాధి ముదిరే అవకాశం ఉన్నదా?

"ఇస్నోఫీలియా అనేది నెత్తుటులో ఉన్న తెల్ల కణాలలోని ఒక విభాగం అయిన "ఈయోసినోఫిల్స్" అధికం అవటమే! ఈయోసినోఫిల్స్ అధికం కావటానికి ఏదైనా కారణం అంటూ ఉండాలి. శరీరానికి పడనిగాలి, దుమ్ము వల్లగాని, కడుపులో చేరే పురుగులవల్లగానీ, మరి కొన్ని ఇతర కారణాల వల్లగాని ఈ ఈయోసినోఫిల్స్ సంఖ్య అధికం అవుతుంది. ఈ వ్యాధి ముదరటం అంటూ ఏమీ లేదు. మూల కారణానికి చికిత్స చేయకపోతే వీటి సంఖ్య మరి కొంత పెరిగే అవకాశం ఉన్నది.

**యు. డి — కొండవరం**

నాకు 20 సం.లు. రాత్రులందు నడుస్తున్నప్పుడు తూలుతూ పడతాను. రాత్రులలో సైకిలు తొక్కలేను. హేండిల్ గాభరాపడుతూ ఉంటాను. మూసకుండా ఉండాలని ప్రయత్నించినా ప్రయోజనం కన్పించట్లేదు. అందరూ రేచీకటి అంటున్నారు.

మీరు నిపుణులైన నేత్ర వైద్యుల వద్ద కళ్లు పరీక్ష చేయించుకోవలసి ఉంది. ఒక విటమిన్ ఎ లోపం వల్ల మాత్రమేగాక మరి కొన్ని నేత్ర రోగాల వల్ల రేచీకటి —నైట్ బ్లయిండ్‌నెస్— ఏర్పడుతుంది. ఉదాహరణకి రెటినైటిస్ పిగ్ మెన్ టోసా చికిత్స పరీక్షానంతరం తీర్మానించవలసి ఉంటుంది.

— డా॥ కె. వెంకటేశ్వరరావు

---

త్వరగా చచ్చిపోవాలి! చాల త్వరగా చచ్చిపోవాలి" లోకమెరుగని పదహారేళ్ల చిన్నారి సుందరికి తన సమస్యకు అంతకన్నా సులభమైన మార్గం తోచలేదు.

కిష్టయ్య మాటలతో అసలే పిరికిదైన సుందరి మరింత పిరికిదై పోయింది. ఆమె భయం ఆమెను పిచ్చి పిచ్చి చేసింది. ఆ భయం ఆ చిన్నారి కన్నె హృదయాన్ని తునాతునకలు చేసింది. అందరి నవ్వులు, మాటలు ఆమె సున్నితమైన మనసును ముక్కలు చేశాయి. ఆమె గురించి సానుభూతితో ఒక్కరన్నా ఆలోచించలేదు.

నాలుగోరోజు సుందరి శవం పాడుపడ్డ బావిలో దొరికింది. రాములమ్మ, వెంకయ్య సుందరి శవం చూడగానే గొల్లుమన్నారు. సుందరి పెళ్లి కోసం జాగ్రత్తగా దాస్తున్న డబ్బును సుందరి శవం మీద చల్లి గోడు గోడున ఏడ్చాడు వెంకయ్య. వెంకయ్య తన మనసులో ఉద్దేశ్యం చూచాయిగానయినా సుందరితో అనుంటే సుందరి చచ్చిపోయి వుండేది కాదు. నవ్వేలోకం బువ్వెట్టదనే అనుకున్నాడు తప్ప, తమ చూపులోట్టి, మాటలతోటి ప్రాణాలు తీయగల శక్తి కూడ లోకులకు వుందని వెంకయ్య తెలుసుకోలేకపోయాడు. ఆ నిజమే తెలిసి వుంటేవెంకయ్య సుందరిని వ్యాపారంలో పెట్టివుండేవాడు కాదు. ఏమైతేనేం సుందరి చచ్చిపోయింది. లోకులు పలురకాలుగా అనుకున్నారు. అవేవీ సుందరికి వినిపించవు. సుందరి బాధలకు, భయాలకు, అవహేళనలకు, విమర్శలకు అతీతంగా వుండే లోకాల కెళ్లిపోయింది. ఓ 'కన్నె కుసుమం' రాలిపోయింది. కాదు కాదు — రాలిపోయేట్టుగా చేశారు అందరూ.